క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా శ్యామ్

అల్లవరం: తుమ్మలపల్లి వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బళ్ల శ్యామ్‌ను ఎంపిక చేసినట్లు మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ మంగళవారం తెలిపారు. రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్ ఆదేశాల మేరకు, సీనియర్ నాయకులు పందిరి సూర్యనారాయణ, పెమ్మాడి సాయి, యాలంగి సత్యనారాయణ, పులుసుగంటి గంగాధర్‌ల ప్రోత్సాహంతో శ్యామ్‌ను ఎంపిక చేశామని వివరించారు.

మురుగులమ్మ తీర్థ మహోత్సవాలు

అమలాపురం రూరల్: బండారులంక గ్రామ దేవత గంగాదేవి మురుగులమ్మ అమ్మవారి జాగరణ, తీర్థ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం శాంతి కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రతిష్ఠించారు. వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జాన జగదీష్ చంద్రగణేష్, స్వాతి దంపతులు అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, చీర, రవికలు అందజేసి ప్రత్యేక పూజలు చేశారు. 24న దేవాంగుల జాగరణ, 25న అమ్మవారి తీర్థం జరుగుతుందని శాంతి కమిటీ తెలిపింది. కార్యక్రమంలో సర్పంచ్ పెనుమాల సునీత, ఎంపీటీసీ గుత్తుల జానకీలక్ష్మి, పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి సరెళ్ల రామకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు బుల్లబ్బులు, శాంతి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

ఘనంగా ముత్యాలమ్మ తీర్థం



సుంకరపాలెం ముత్యాలమ్మను దర్శించుకుంటున్న సర్పంచ్ నాగేశ్వరరావు తదితరులు

తాళ్లరేవు: సుంకరపాలెం గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారి తీర్థం మంగళవారం ఘనంగా జరిగింది. ఆది, సోమవారాలు గరగ నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో అమ్మవారి జాతర నిర్వహించారు. అమ్మవారి తీర్థ మహోత్సవానికి పరిసర ప్రాంతాలకు చెందిన అనేక మంది భక్తులు తరలివచ్చి మొక్కులు సమర్పించుకున్నారు. మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు, సర్పంచ్ టిళ్లపూడి నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న చాంబర్ అధ్యక్షుడు సత్తిబాబు, లయన్స్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక మెయిన్ రోడ్డులోని యర్రమిల్లివారి పెట్రోలు బంకు వద్ద లయన్స్ క్లబ్ ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్తిబాబు మంగళవారం ప్రారంభించారు. వేసవి కాలమంతా ప్రజలు దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రం అందుబాటులో ఉంటుందని లయన్స్ క్లబ్ ప్రతినిధులు యర్రమిల్లి విశ్వేశ్వరరావు, పెనుమాల చిట్టిబాబు, గుర్రం రామకృష్ణ తెలిపారు. బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, చాంబర్ ప్రతినిధులు చింతలపూడి సత్తిబాబు, దొమ్మేటి సాయిబాబు, కొమ్మూరి వెంకటాచలప్రసాద్, రేపపల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీబీఈటీ చైర్మన్‌గా శివప్రసాద్

తాళ్లరేవు: కోరంగి అభయారణ్యం కమ్యూనిటీ బేస్ ఎకో టూరిజం (సీబీఈటీ) చైర్మన్‌గా లక్ష్మీపతిపురం గ్రామానికి చెందిన కె.శివప్రసాద్ ఎన్నికయ్యారు. కోరంగి ఫారెస్ట్ కాంప్లెక్స్‌లో మంగళవారం ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతన చైర్మన్ ఎన్నిక జరిగింది. ఇప్పటివరకూ పనిచేసిన కర్రి తాతారావు పదవీకాలం ముగియడంతో నూతన చైర్మన్‌గా శివప్రసాద్‌ను ఎంపిక చేశారు. ఫారెస్ట్ సెక్షన్ అధికారులు ఎం.నాగార్జున, ఎస్.వీరభద్రరావు, బీట్ అధికారులు ఎస్.వరలక్ష్మి, ధనలక్ష్మి, జి.గోపీ నాగేంద్రకుమార్ తదితరులు హాజరయ్యారు.

సచివాలయానికి నిప్పుపెట్టే యత్నం



బోడసకుర్రు సచివాలయం వద్ద మంటలు

అల్లవరం: బోడసకుర్రు సచివాలయానికి మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి నిప్పు పెట్టాడని ఎంపీడీఓ సరోవర్ తెలిపారు. సంచిపై కిరోసిన్ పోసి సచివాలయంలోకి ఓ వ్యక్తి విసిరే ప్రయత్నం చేశాడని, ఆ సంచి కిటికీలో నుంచి లోపలకు వెళ్లకపోవడంతో వరండాపై పడి మంటలు చెలరేగాయన్నారు. స్థానికులు స్పందించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామని ఎంపీడీఓ వివరించారు. దీనివల్ల సచివాలయానికి ఎటువంటి నష్టం జరగలేదని ఆయన అన్నారు.

చిత్రం.. కళాత్మకం

- చిత్రలేఖనంలో రాణిస్తున్న గురుకుల విద్యార్థులు
- జాతీయ స్థాయి పోటీల్లో ఏడు పతకాలు



జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన గోడి బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు

అల్లవరం: ఆసక్తి, పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా సత్తా చాటొచ్చు.. ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు.. దానినే అందిపుచ్చుకుని చిత్రకళలో ఆ చిట్టిచేతులు ప్రత్యేకత చాటుతున్నాయి.. అందరిలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నాయి.. అల్లవరం మండలం గోడి బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు విద్యతో పాటు చిత్రలేఖనంలో ప్రతిభ చాటుతున్నారు. అందరిచే శెభాష్ అనిపించుకుంటున్నారు. ఇటీవల విజయవాడలో డ్రీమ్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ జాతీయ స్థాయి చిల్డ్రన్ యూత్ ఆర్ట్ పోటీల్లో గోడి బాలుర గురుకులం విద్యార్థులు అద్భుత ప్రతిభ చాటారు. 7వ తరగతి విద్యార్థి కె.దివ్య సురేష్, 8వ తరగతి విద్యార్థి నవీన్‌చంద్ర, పదో తరగతి, ఇంటర్ చదువుతున్న భానుచరణ్, దర్శన్‌బాబులు వేసిన చిత్రాలు జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించాయి. 5వ తరగతి విద్యార్థి సంజయ్ కుమార్, 6వ తరగతి విద్యార్థులు యస్వంత్, పి.స్టాలిన్‌లు వెండి పతకాలు సాధించారు. మరో 17 మంది ప్రోత్సాహక బహుమతులు పొందారు. గోడి బాలుర గురుకులంలో డ్రాయింగ్ టీచర్‌గా బాధ్యతలు స్వీకరించిన వురం రాజ్‌కుమార్ తొమ్మిది నెలల వ్యవధిలో విద్యార్థుల్లో



చిత్రాలు గీస్తున్న విద్యార్థులు

ప్రతిభను గుర్తించి పతకాలు సాధించడంలో ముఖ్య భూమిక పోషించారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించడంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డ్రాయింగ్ టీచర్ వురం రాజ్‌కుమార్ కూడా పలు అవార్డులు సాధించారు. కోనసీమ చిత్రకళా పరిషత్ ఆధ్వర్యంలో విశిష్టాచార్య అవార్డు, రెండు పర్యాయాలు బెస్ట్ టీచర్ అవార్డును అందుకుని పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

మక్కువను గుర్తించి తర్ఫీదు



నాలుగు దశల్లో చిత్రలేఖనం ఉంటుంది. దీనిపై మక్కువ ఉన్న విద్యార్థులను గుర్తించి రోజూ ఒక బొమ్మ వేసేలా అవగాహన కల్పించాం. బొమ్మలు వేసేటప్పుడు సందేశం ఉండేలా విద్యార్థులకు సూచనలు చేస్తున్నాం. ఖాళీ సమయాల్లో బొమ్మలు వేయడం అలవాటు చేసుకుంటే అద్భుతాలు సాధించవచ్చు.

– వురం రాజ్‌కుమార్, డ్రాయింగ్ టీచర్, గోడి బాలుర గురుకులం

చిన్నప్పటి నుంచి ఇష్టం



బొమ్మలు వేయడం నాకు చిన్నప్పటి నుంచి ఇష్టం. రాజ్‌కుమార్ మాష్టారు నేర్పిన మెలకువలతో జాతీయ స్థాయిలో అవార్డులు రావడం ఆనందంగా ఉంది. చిత్ర లేఖనంలో మరిన్ని పతకాలు సాధించేందుకు కృషి చేస్తా. కోనసీమ చిత్రకళా పరిషత్, హిందూ యంగ్ వరల్డ్, డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ అకాడమీలో పతకాలు సాధించాను.

– పి.భానుచరణ్, విద్యార్థి, పదో తరగతి

సంతోషంగా ఉంది



మూడో తరగతి నుంచే డ్రాయింగ్‌పై ఇష్టం ఉండేది. పేపర్లో చూసి వచ్చి రాని బొమ్మలు వేసేవాడిని. డ్రాయింగ్ టీచర్ చెప్పిన సలహాలు, సూచనలతో తొలిసారిగా జాతీయ స్థాయిలో పతకం సాధించడం చాలా సంతోషంగా ఉంది. భవిష్యత్తులో డ్రాయింగ్ టీచర్ కావాలన్నదే నా లక్ష్యం.

– కె.యశ్వంత్, 6 వ తరగతి

పనులు ఎందుకు చేపట్టలేదో చెప్పండి..?



ఆర్‌ఏఓ మునిస్వామితో సమావేశమైన ఎమ్మెల్యే అశోక్

యానాం: యానాంలో సమస్యలు తీర్చాలని నిరాహార దీక్ష చేసిన సమయంలో ప్రభుత్వం ముందుంచిన 17 డిమాండ్లలో ఆరు తక్షణం ఆమోదించినా, ఇప్పటివరకూ అధికారులు పనులు ఎందుకు ప్రారంభించలేదని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ప్రశ్నించారు. ఈ మేరకు సంబంధింత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆర్ఏఓ మునిస్వామిని కోరారు. మంగళవారం స్థానిక ఆర్ఏఓ చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎస్ఆర్ నిధుల నుంచి 6 పనులను తక్షణం చేయాలని, తన నిరాహార దీక్ష విరమణ సమయంలో హోంమంత్రి నమశ్శివాయం స్పష్టం చేశారన్నారు. ఇప్పటివరకు పనులు ప్రారంభించకుండా పీడబ్ల్యూడీ అధికారులు కాలయాపన చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ ల్యాడ్ నిధులు విడుదలై ఐదు నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించలేదన్నారు. ప్రస్తుత వేసవిలో తాగు, సాగునీరు ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని పీడబ్ల్యూడీ జేఈ నాగరాజు తదితరులు తెలిపారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ వసంతం



కాట్రేనికోనలో ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్



సాకుర్రులో పథకాల లబ్ధి పత్రాలను అందజేస్తున్న మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్

కాట్రేనికోన: సీఎం జగనన్న ప్రభుత్వంలో గడప గడపకూ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. కాట్రేనికోనలో సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, మండల కన్వీనర్ నల్లా నరసింహమూర్తి, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు సంసాని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం–1 పరిధి తిమ్మాపురం, వెంకమ్మ చెరువు ప్రాంతాల్లో పర్యటించారు. జెడ్పీటీసీ నేలకిషోర్, సెంట్రల్ డెల్టా చైర్మన్ ఏడిది చక్రపాణీరావు ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నల్లా బేబి జానకి, నాయకులు నడింపల్లి సూరిబాబు, పాలెపు ధర్మారావు (పల్లం), నాతి సత్యనారాయణలతో పాటు ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధులు రూ.20 లక్షలతో తిమ్మాపురంలో మల్టీపర్పస్ కమ్యూనిటీ భవన నిర్మాణానికి శిలాఫలకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏడిది సుబ్బు, సానబోయిన నాగేశ్వరరావు, జగడం బాలయ్య తదితరులు ఉన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

ప్రభుత్వ మద్యం షాపులలో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని అమలాపురం పరిధిలో పనిచేస్తున్న సేల్స్‌మెన్స్, సూపర్‌వైజర్లు ఎమ్మెల్యే పొన్నాడకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగి షూరిటీ సంతకంతో సెక్యూరిటీ బాండ్ ఇవ్వకుంటే ఉద్యోగం నుంచి తొలగిస్తామని ఉన్నతాధికారులు అంటున్నారని రమణమూర్తి, పాలెపు ప్రసాద్, గంగాద్రి, శ్రీకాంత్, బాలాజీ, చినరాజు, సుబ్రహ్మణ్యం తదితరులు అన్నారు.

అందరికీ పథకాలు

అమలాపురం రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. సాకుర్రులో సర్పంచ్ గుత్తుల చిరంజీవి, వైస్ ఎంపీపీ పోలమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, పార్టీ నాయకులతో కలసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో అందించిన పథకాల లబ్ధిని శ్రీకాంత్ వివరించారు. సమస్యలు ఉంటే తెలపాలని ప్రజలను అడిగారు. ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, పార్టీ మండల అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, వైస్ ఎంపీపీ పోలమూరి బాలకృష్ణ, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు, నాయకులు కేతా భానుతేజ, సూదా గణపతి, సరెళ్ల రామకృష్ణ, బొక్కా నరసింహమూర్తి పాల్గొన్నారు.

జగనన్నే మనందరి భవిష్యత్తు



అనాతవరంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జెడ్పీటీసీ శంకరరావు తదితరులు



పెద్దూరులో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌ను అతికిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

ముమ్మిడివరం: జగనన్నే మనందరి భవిష్యత్తు అని జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, సచివాలయ కన్వీనర్ల కోఆర్డినేటర్ కోలా బాబ్జీ అన్నారు. అనాతవరంలో మంగళవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. మండలంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధి తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల అనుమతితో ఇంటి గోడలకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అంటించారు.

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీలోని 30 వార్డుల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి. ప్రజా మద్దతు పుస్తకంలో ఐదు ప్రశ్నలకు సమాధానాలు రాసుకున్నారు. 12వ వార్డులో కౌన్సిలర్ కట్టోజు సన్నయ్యదాసు, 27వ వార్డులో కౌన్సిలర్ బండారు గోవిందు, 17వ వార్డులో కౌన్సిలర్ దొమ్మేటి రాము, 19వ వార్డులో పార్టీ ఇన్‌చార్జి చిక్కాల రవిశంకర్, 7వ వార్డులో వార్డు పార్టీ ఇన్‌చార్జి కల్వకొలను ఉమా ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

సంక్షేమానికి బాటలు

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రజా సంక్షేమానికి బాటలు పడ్డాయని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ అన్నారు. స్థానిక పెద్దూరులో సర్పంచ్ కడిమి చిన్నవరాజు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్‌లతో కలసి ఎమ్మెల్సీ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను పార్టీ నాయకులు సత్కరించారు. ఎంపీటీసీ సభ్యురాలు వంగా గిరిజా కుమారి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అడబాల మాధవ, నాయకులు మోటూరి సత్యంకాపు, పెయ్యల రమణ పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో ఉద్యాన వనం

రూ.6 లక్షలతో లయన్స్ క్లబ్ నిర్మాణం



ఆలయ ప్రాంగణంలో ఉద్యాన వనాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ బాదం బాలకృష్ణ

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో లయన్స్ క్లబ్ తన శాశ్వత నిర్మాణ కార్యక్రమంలో భాగంగా రూ. 6 లక్షలతో శ్రీవేంకటేశ్వర ఉద్యాన వనాన్ని నిర్మించింది. అమలాపురం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జంపన సుమన్‌వర్మ తన తండ్రి దివంగత జంపన సూర్యనారాయణ రాజు (జకార్ రాజు) జ్ఞాపకార్థం ఈ ఉద్యాన వనాన్ని నిర్మించారు. దీనిని లయన్స్ పూర్వపు గవర్నర్, అంబాసిడర్ ఆఫ్ గుడ్‌విల్ అవార్డు గ్రహీత డాక్టర్ బాదం బాలకృష్ణ మంగళవారం ప్రారంభించారు. ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, ఈఓ దూనబోయిన సాయిబాబు, లయన్స్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ అనిల్‌కుమార్, పూర్వపు లయన్స్ గవర్నర్ డాక్టర్ పీఎస్ శర్మ పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో లయన్స్ ప్రతినిధులకు అర్చకులు వేదాశీర్వాదాలు అందించి సత్కరించారు. ఆలయ ప్రాంగణంలో ఉద్యాన వనాన్ని నిర్మించిన లయన్స్ అధ్యక్షుడు సుమన్‌వర్మను ఆలయ ధర్మకర్తల మండలి అభినందించింది. ఉద్యాన వనంలో దశావతారాల విగ్రహాలతో పాటు నిత్యం స్వామికి పూజ చేసేందుకు అందుబాటులో ఉండేలా తులసీ వనం, మారేడుదళ మొక్కలు, పలు రకాల పూల మొక్కలను నాటారు. ఉద్యాన వనంలో భక్తులు సేద తీరేందుకు సిమెంట్ బల్లలు ఏర్పాటు చేశారు.

అన్నదాన ట్రస్ట్‌కు రూ.25 వేల విరాళం

ఆలయానికి ప్రతి శనివారం వచ్చే భక్తుల ఆకలి తీర్చే అన్నదాన ట్రస్ట్‌కు గంగలకుర్రు గ్రామానికి చెందిన గరిమెళ్ల శ్రీనివాసరావు, శారదాదేవి దంపతులు రూ.25 వేల విరాళం సమర్పించారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును ఆలయ ఈఓ సాయిబాబుకు దాతలు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి, ఆలయ ధర్మకర్తలు దూనబోయిన బుజ్జి, కాళే చంటి తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి చేపల వేట నిషేధం

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో పుదుచ్చేరి ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకూ సముద్రంలో చేపల వేట నిషేధించినట్లు మత్స్య శాఖ ఏడీ దడాల గొంతియ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిషేధ రోజుల్లో చేపల వేటకు సముద్రంపైకి వెళ్లరాదని హెచ్చరిక చేసినట్లు తెలిపారు. యంత్ర బోట్లు, ఇంజిన్ నావలు, వలలు, వేట పరికరాలను సురక్షిత ప్రదేశంలో భద్రపరుచుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆదేశాలను మత్స్యకారులు విధిగా పాటించాలని కోరారు.

విశ్రాంత ఉద్యోగుల సమావేశం

అమలాపురం రూరల్: ఈదరపల్లిలోని విద్యుత్తు ఉద్యోగుల సమావేశ భవనంలో కోనసీమ జిల్లా ఏపీ ఎస్ఈబీ విశ్రాంత అఫీషియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం జిల్లా అధ్యక్షుడు సత్తి శ్రీరంగ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యకలాపాలపై చర్చించారు. ముఖ్య అతిథిగా జిల్లా జనరల్ సెక్రటరీ ఎ.వీరభద్రరావు హాజరయ్యారు. ఇటీవల సంఘ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన వీరభద్రరావును ఘనంగా సత్కరించారు. డివిజన్ కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

తాళ్లరేవు: యానాం నుంచి అక్రమంగా మద్యాన్ని తీసుకువచ్చి విక్రయిస్తున్న మేడిశెట్టి దుర్గాప్రసాద్‌ను శనివారం అరెస్ట్ చేసినట్లు తాళ్లరేవు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ జేవీ భవానీ తెలిపారు. కాకినాడ జిల్లా ఎస్ఈబీ అధికారుల ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ దాడుల్లో భాగంగా పాతకోరంగిలో దుర్గాప్రసాద్‌ను పట్టుకున్నామన్నారు. అతని నుంచి 127 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని, కాకినాడ ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా అతనికి 15 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ ఎస్సై ఎంవీవీబీ కుమార్, కానిస్టేబుళ్లు డి.శ్రీనివాసరావు, ఎం.మధు తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదుపై విచారణ



ఎన్.కొత్తపల్లిలో గ్రామస్తులను విచారిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వరరావు

ఉప్పలగుప్తం: తన చెరువుల వద్దకు ఎవరూ పనికి రాకుండా గ్రామస్తులు వెలివేశారని స్పందనలో మంగళవారం ఎన్.కొత్తపల్లి గ్రామానికి చెందిన కోలా నరసింహమూర్తి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు 9 మందిపై కేసు నమోదు చేశారు. అనంతరం ఎన్.కొత్తపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో పలువురు అధికారులతో కలసి గ్రామ పెద్దలతో ప్రాథమిక విచారణ చేపట్టారు. ఇటువంటి చర్యలకు పాల్పడరాదని హెచ్చరించి, ఏదైనా సమస్య వస్తే చట్టాలు ఉన్నాయని వివరించారు. శ్మశాన వాటిక తగాదా నేపథ్యంలో గ్రామస్తులు ఎవరూ అతని దగ్గరకు వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదని పెద్దలు బదులు ఇచ్చారు. డీటీ సుబ్రహ్మణ్యం, ఆర్ఐ వెంకటరమణ, మండల పరిషత్ ఏవో మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు తెరిచే రోజే 'విద్యా కానుక'



గొల్లవిల్లిలో తరగతి గదులను పరిశీలిస్తున్న నిరంజన్‌కుమార్

ఉప్పలగుప్తం: ప్రభుత్వం జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు సమకూర్చుతుంది. వీటిని వేసవి సెలవుల అనంతరం జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభించే సరికి 100 శాతం అందించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారని రాష్ట్ర ప్రణాళికా విభాగం కోఆర్డినేటర్ పి.నిరంజన్‌కుమార్ అన్నారు. జేవీకే కిట్లను భద్రపరిచే గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో తరగతి గదులను మంగళవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సీఎంఓ బీవీ సుబ్రహ్మణ్యం, ఎంఈవో కుమార్‌బాబు, సీఆర్పీలు పాల్గొన్నారు.

అణగారిన జీవితాల్లో అక్షర దీపం ఫూలే

అమలాపురం టౌన్: అణగారిన వర్గాల జీవితాల్లో అక్షర దీపం వెలిగించిన సామాజిక విప్లవవేత్త మహాత్మా జ్యోతిరావు పూలే అని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. పట్టణ వైఎస్సార్ సీపీ, జిల్లా పార్టీ బీసీ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అమలాపురంలోని మున్సిపల్ పిల్లల పార్కు వద్ద పూలే జయంతి కార్యక్రమం జరిగింది. పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్ప నాయుడు, మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు. స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి ఏఎస్పీ కె.లతామాధురి పూలమాలలు వేశారు. ఏఆర్ డీఎస్పీ పి.విజయసారధి, ఎస్బీ సీఐ కోలా రజనీకుమార్, ఎస్పీ కార్యాలయ ఏఓ డి.జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు. అమలాపురం పిల్లల పార్కు వద్ద జిల్లా బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పూలే జయంతి కార్యక్రమం జరిగింది. అక్కడ పూలే విగ్రహానికి సంఘ జిల్లా కన్వీనర్ కె.భాస్కర రామారావు, ప్రతినిధులు రాజులపూడి సుబ్రహ్మణ్యేశ్వరరావు, తదితరులు పూల మాలలు వేశారు. స్థానిక కోర్టుల భవనాల వద్ద బార్ అసోసియేషన్ కార్యాలయంలో పూలే జయంతి కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణరావు, ప్రతినిధులు కుడుపూడి త్రినాథ్, పినిపే రాధాకృష్ణ, కుడుపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అమలాపురంలో పూలే విగ్రహానికి నివాళి అర్పిస్తున్న చైర్‌పర్సన్ నాగేంద్రమణి, నాయకులు



ఎస్పీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఎస్పీ లతామాధురి



ఉప్పలగుప్తంలో పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అల్లవరం: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే అని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. దేవగుప్తంలో బీసీ నాయకుడు కుడుపూడి అప్పారావు ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి ఆయన పూలమాల వేశారు. ఎమ్మెల్సీగా ఎన్నికై తొలిసారిగా దేవగుప్తం వచ్చిన సూర్యనారాయణరావును సత్కరించారు. సర్పంచ్ సాధనాల వెంకటరావు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. అల్లవరం హైస్కూల్ సెంటర్లో జరిగిన పూలే జయంతి వేడుకలకు ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సర్పంచ్ తిక్కిరెడ్డి శ్రీను, సొసైటీ చైర్మన్ యల్లమిల్లి బోసు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: స్థానికంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పూలే జయంతిని నిర్వహించారు. సీఐటీయూ నాయకులు జి.దుర్గాప్రసాద్, ఎస్.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: స్థానిక ప్రజా సంఘాల భవనంలో స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో జరిగిన జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమానికి ఎంపీపీ రాయుడు సునీత హాజరయ్యారు. తాళ్లరేవులో పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానించారు. జెడ్పీటీసీ దొమ్మేటి సామ్యూల్ సాగర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కుడుపూడి శివన్నారాయణ పాల్గొన్నారు. నీలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ పెయ్యల రమేష్ హాజరయ్యారు.

ఉప్పలగుప్తం: స్థానికంగా పూలే జయంతిని కార్యక్రమాన్ని పార్టీలకు అతీతంగా బీసీ నాయకులు నిర్వహించారు. పూలే విగ్రహానికి ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్ తదితరులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జెడ్పీటీసీ గెద్దం సంపదరావు, సర్పంచ్ కడిమి చిన్నవరాజు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిశోర్, జిన్నూరి వెంకటేశ్వరరావు, అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్‌ఖాదర్, మండల పార్టీ అధ్యక్షుడు బద్రిబాబ్జి, చప్పిడి దుర్గారావు పాల్గొన్నారు.

యానాం: స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో పూలే విగ్రహానికి ఆర్ఏఓ మునిస్వామి తదితరులు పూలమాలలు వేశారు. ఎస్పీ రఘునాయగం, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ పాల్గొన్నారు.